బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 28 డిసెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

## 2025లో ప్రభుత్వ సెలవులు ఇవే..




**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

2025 ఏడాదికి సంబంధించిన సాధారణ, ఐచ్ఛిక సెలవుల జాబితాను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. వచ్చే ఏడాదిలో మొత్తం 27 సాధారణ, 23 ఐచ్ఛిక సెలవులు ఇస్తున్నట్టు ప్రభుత్వ ఉత్తర్వులో పేర్కొన్నారు. జనవరి 14న సంక్రాంతి, మార్చి 30న ఉగాది, ఆగస్టు 27న వినాయకచవితి, అక్టోబర్ 3న దసరా, 20న దీపావళి పండుగల నేపథ్యంలో సెలవులు ప్రకటించారు. కొత్త ఏడాది సందర్భంగా జనవరి 1న ప్రభుత్వం సెలవు ప్రకటిం చింది. ఇందుకు బదులుగా ఫిబ్రవరి 10న రెండో శనివారాన్ని పనిదినంగా ఉత్తర్వుల్లో పేరొన్నది.



# ఆర్థిక సంస్కర్తకు ఘన నివాళి

- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- ఏడు రోజులు సంతాప దినాలు
- తీర్మానం ఆమోదించిన కేంద్ర మంత్రి వర్గం
- రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురి నివాళి
- అంతర్జాతీయ నేతల సంతాపం

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

అనారోగ్య సమస్యలతో ఢిల్లీ ఎయిమ్స్‌లో గురువారం రాత్రి తుదిశ్వాస విడిచిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పార్థివదేహాన్ని ఆయన నివాసానికి తరలించారు. పలువురు ప్రముఖులు మన్మోహన్ నివాసానికి చేరుకొని ఆయన భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్మ, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులు మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులు అర్పించారు. అలాగే కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ, ఆ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు పార్టీ నేతలు మన్మోహన్ సింగ్ భౌతికఖాయం వద్ద పుష్పాంజలి ఘటించారు. మన్మోహన్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా పలువురు కేంద్రమంత్రులు, వివిధ రాజకీయపార్టీల ముఖ్యనేతలు, ముఖ్యమంత్రులు కూడా మన్మోహన్ నివాసానికి చేరుకొని ఆయన భౌతికకాయం వద్ద అంజలి ఘటించారు.

**తెలంగాణ సీఎం నివాళ్లు**

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ భౌతికకాయానికి ముఖ్యమంత్రి నివాళి అర్పించారు. సీడబ్ల్యూసీ సమావేశాల కోసం బెళగావి వెళ్లిన సీఎం, మాజీ ప్రధాని మరణవార్త తెలియగానే అక్కడి నుంచి నేరుగా దిల్లీ వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు. దేశం కోసం నిష్కళంకమైన, సమగ్రమైన నిర్ణయాలు తీసుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. రాజకీయ, ప్రజా జీవితంలో మన్మోహన్ సింగ్ లెజెండ్‌గా ఉన్నారని సీఎం కీర్తించారు. దేశాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్లడంలో ఆయన పాత్ర అనన్యంగా కీర్తించారు. మన్మోహన్ సింగ్ మృతిపట్ల ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంతాపం తెలిపారు. ముఖ్యమంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ సహా రాష్ట్రానికి చెందిన పలువురు ఎంపీలు ఉన్నారు. శనివారం నాటి అంత్యక్రియల్లో కొందరు నేతలు పాల్గొననున్నారు.

**కాంగ్రెస్ కార్యక్రమాలు రద్దు**

మాజీ ప్రధాని మృతితో వారంపాటు పార్టీకి చెందిన అన్ని కార్యక్రమాలు రద్దు చేస్తున్నట్లు పీసీసీ ఓ ప్రకటనలో తెలిపింది. శనివారం నాటి కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్స వాలతోపాటు జనవరి 3వ తేదీ వరకు అన్ని రాజకీయ

## మన్మోహన్ మృతి నాకు 'వ్యక్తిగత నష్టం'

- సోనియా గాంధీ

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిని తనకు 'వ్యక్తిగత నష్టం' అని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సిపిపి) చీఫ్ సోనియా గాంధీ శుక్రవారం వ్యాఖ్యానించారు. ఆయన తనకు మిత్రుడు, తత్వవేత్త, మార్గదర్శకుడు అని, ఆయన మరణంతో పార్టీ విజ్ఞత, గొప్పతనం, వినయం మూర్తీభవించిన నేతను కోల్పోయిందని సోనియా పేర్కొన్నారు. సింగ్ మృతితో జాతీయ జీవనంలో ఎవ్వరూ భర్తీ చేయలేని లోటు ఏర్పడిందని సోనియా గాంధీ ఆయన మృతిపై సంతాప సందేశంలో పేర్కొన్నారు. 'కాంగ్రెస్ పార్టీలో మేము, దేశ ప్రజలు డాక్టర్ మన్మోహన్ సింగ్ వంటి నేతను కలిగి ఉన్నందుకు ఎన్నటికీ గర్విస్తుంటారు. కృతజ్ఞులై ఉంటారు. దేశ ప్రగతికి, అభివృద్ధికి ఆయన కృషి ఎనలేనివి' అని ఆమె అన్నారు. 'డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతితో మేము విజ్ఞత. గొప్పతనం, వినయం మూర్తీభవించిన నేతను కోల్పోయాం. ఆయన మనస్ఫూర్తిగా దేశానికి సేవలు అందించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రియతమ మార్గదర్శక జ్యోతి అయిన సింగ్ దూరదృష్టి కోట్లాది మంది భారతీయుల జీవితాలకు సాధికారత చేకూర్చింది' అని సోనియా పేర్కొన్నారు. సింగ్ నిష్కల్మష హృదయానికి దేశ ప్రజలు ఆయనను ప్రేమించారని సోనియా తెలిపారు. ఆయన సలహా, 'విజ్ఞతతో కూడిన సూచనల'ను దేశంలో వివిధ రాజకీయ వర్గాల వారు ఆత్రుతగా కోరుతుంటారని, వాటికి ఎంతో విలువ ఇస్తుంటారని ఆమె తెలిపారు. 'సాంఘిక న్యాయానికి, లౌకికతకు, ప్రజాస్వామ్య విలువలకు ఆయన నిబద్ధత ప్రగాఢమైనది, మొక్కవోనిది' అని సోనియా అన్నారు. సిపిపి ఛైర్‌పర్సన్ సోనియా శుక్రవారం ఉదయం డాక్టర్ సింగ్ నివాసంలో ఆయన భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ ప్రధానికి నివాళులు అర్పించేందుకుఏర్పాటైన సిడబ్లుసి సమావేశానికి కూడా ఆమె హాజరయ్యారు.



## మన్మోహన్ సింగ్ పార్థివ దేహానికి కేటీఆర్ నివాళులు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పార్థివ దేహానికి ఢిల్లీలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం నివాళు లర్పించారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్ రెడ్డి, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దామోదర్ రావుతో కలిసి మన్మోహన్ నివాసానికి వెళ్లిన కేటీఆర్ ఆయన సతీమణి గురుశరణ్ కౌర్ ను పరామర్శించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయిన భారత్ ను బలమైన శక్తిగా నిలబెట్టడానికి మన్మోహన్ సింగ్ కృషి చేశారన్నారు. ఆయన మరణం దేశానికి తీరని లోటు అన్నారు. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని, ఆయన తెలంగాణకు మద్దతునిచ్చారని గుర్తు చేశారు.

# కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**




బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కు మధ్యంతర బెయిల్‌ను హైకోర్టు మరో రోజు పాటు పొడిగించింది. ఫార్ములా– ఈ కార్ రేసు కేసులో కెటిఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు విచా రించింది. ఈ నెల 21న కెటిఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై డిసెంబర్ 30 వరకు ఆయనను అరెస్ట్ చేయవద్దని ఎసిబిని ఇంతకు ముందు ఆదేశిం చిన విషయం విదితమే. ఆ తర్వాత విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. దీంతో శు క్రవారం ఈ పిటిషన్‌ను విచారించిన కోర్టు ఈ నెల 31 వరకు ఆయనను అరెస్ట్ చేయవద్దని ఆదేశించింది. తనపై ఎసిబి నమోదు చేసు చేసిన కేసులను కొట్టివేయాలని కోరుతూ ఈ నెల 21న కెటి ఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఆ పిటిషన్‌పై ఇప్పటికే విచారణ చేపట్టిన ధర్మాసనం కెటిఆర్‌ను ఈనెల 30 వరకు అరెస్ట్ చేయకూడదని ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో విచారణను కొనసాగించవచ్చని హైకోర్టు పేర్కొంటూ కౌంటర్ దాఖలు చేయాలని ఎసిబి, పురపాలక శాఖ కార్యదర్శి దానకిషోర్‌లకు నోటీసులు జారీ చేసింది. కేసులో 'కేటీఆర్ నాట్ టు అరెస్ట్'ను ఎత్తివేయాలని ఎసిబి పిటిషన్ దాఖలు చేయగా కౌంటర్ దాఖలు చేయాలంటూ కెటిఆర్, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. అయితే, కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రభుత్వం సమయం కోరగా న్యాయమూర్తి విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు.

ఈ కేసులో హైకోర్టులో ఎసిబి అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. కెటిఆర్‌ను అరెస్ట్ చేయవద్దని ఇచ్చిన ఆదేశాలను ఎత్తివేయాలని కోరుతూ మరో పిటిషన్‌ను వేశారు. ఈ పిటిషన్‌పై విచారణను కోర్టు డిసెంబర్ 31కి వాయిదా వేసింది. ఈ కేసులో కెటిఆర్‌ను విచారించాలని ఎసిబి కోరుతోంది. ఈ దశలో ఆయనకు బెయిల్ మంజూరు చేసినా, ఆయనకు ఎలాంటి రిలీఫ్ ఇచ్చినా విచారణకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని ఆ పిటిషన్‌లో ఎసిబి అధికారులు పేర్కొన్నారు. ఈ కారణంతో కెటిఆర్‌ను అరెస్ట్ చేయవద్దనే ఆదేశాలను ఎత్తివేయాలని కోరారు. అంతేకాదు ఈ కేసులో ఫిర్యాదుదారుడైన పురపాలకశాఖ కార్యదర్శి దానకిషోర్ సైతం కౌంటర్ దాఖలు చేయనున్నారు.

## తెలంగాణ ప్రజాప్రతినిధులకు టీటీడీ శుభవార్త

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**



తెలంగాణ ప్రజాప్రతినిధులకు టీటీడీ శుభవార్త చెప్పింది. తిరుమల శ్రీవారి దర్శనాల కోసం వారానికి రెండు సార్లు తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫారసు లేఖలను అనుమతించాలని నిర్ణయించింది. తిరుమల శ్రీవారి దర్శనానికి తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను అనుమతించక పోవడంపై కొద్దిరోజులుగా చర్చ జరుగుతోంది. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను అనుమతించకపోవడాన్ని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఖండించారు. తిరుమలలో తెలంగాణ మంత్రులు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులను చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలోనే తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖల అంశాన్ని టీటీడీ పునఃపరిశీలించింది. సాటి తెలుగు రాష్ట్రంపై ఇలాంటి నిర్ణయం సరికాదని భావించింది. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను అనుమతించాలని టీటీడీ బోర్డులోని మెజారిటీ సభ్యులు కూడా కోరారు. దీంతో వారానికి రెండుసార్లు తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను అనుమతించాలని టీటీడీ బోర్డు నిర్ణయం తీసుకుంది.

## నేడు అంత్యక్రియలు

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పార్థివ దేహానికి అంత్య క్రియలు శనివారం అధికారిక లాంఛనాలతో జరుగుతాయని కేంద్ర హోంశాఖ శుక్రవారం తెలిపింది. ఢిల్లీలోని నిగమ్ బోధ్ ఘాట్‌లో శనివారం ఉదయం 11.45 గంటలకు ఆయన అంతిమ సంస్కారాలు జరుగుతాయని పేర్కొంది. సైనిక లాంఛనాలతో ఆయనకు అంతిమ వీడ్కోలు పలికేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని రక్షణ శాఖను కోరినట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది.

ఢిల్లీలోని మోతీలాల్ నెహ్రూ రోడ్డులో గల మన్మోహన్ సింగ్ నివాసంలో ఆయన పార్థివ దేహాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు అక్కడ నుంచి ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తరలిస్తారు. ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానుల సందర్శనార్థం ఏఐసీసీ కార్యాలయంలో ఉంచుతారు. తదుపరి మన్మోహన్ సింగ్ అంతిమ యాత్ర ప్రారంభం అవుతుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు.

**మన్మోహన్ స్మారక స్థలం నిర్మించండి.. ప్రధాని మోదీకి ఖర్గే లేఖ**

ఇదిలా ఉంటే, మన్మోహన్ సింగ్‌కు అంత్య క్రియలు నిర్వహించే ప్రదేశంలో స్మారక స్థలం నిర్మించాలని ప్రధాని నరేంద్రమోదీని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కోరారు. దేశానికి రెండు సార్లు ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ కు స్మారక స్థలం ఏర్పాటు చేసే విషయమై శుక్రవారం ఉదయం ప్రధాని మోదీతో ఫోన్ లో ఖర్గే మాట్లాడారు. తాజాగా ఈ అంశంపై రెండు పేజీల లేఖ రాసిన ఖర్గే, రాజ నీతిజ్ఞులు, మాజీ ప్రధానులకు అంత్య క్రియలు జరిగిన స్థలంలోనే వారి స్మారకాలు నిర్మించిన సంప్రదాయం ఉందని గుర్తు చేశారు. దేశ ప్రజల హృదయాల్లో మన్మోహన్ సింగ్ అత్యంత గౌరవనీయ స్థానం కలిగి ఉన్నారని, ఆయన సేవలు, సాధించిన విజయాలు అపూర్వం అని కొనియాడారు.

## టీజీ టెట్ హాల్ టికెట్లు విడుదల..

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

టీజీ టెట్ –2024 హాల్ టికెట్లు విడుదలయ్యాయి. షెడ్యూల్ ప్రకారం గురువారమే హాల్ టికెట్స్ విడుదల చేయాల్సి ఉండగా.. కానీ విడుదల చేయలేదు. మొత్తానికి శుక్రవారం సాయంత్రం 5 గంటల తర్వాత టీజీ టెట్ హాల్ టికెట్లను విడుదల చేశారు.జనవరి 2 నుంచి 20వ తేదీ దాకా టెట్ పరీక్షలను ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించనున్నారు. అయితే జనవరి 11వ తేదీన నిర్వహించే మార్నింగ్ సెషన్, జనవరి 20న నిర్వహించే ఉదయం, మధ్యాహ్నం సెషన్లకు సంబంధించిన హాల్ టికెట్లను విడుదల చేయలేదని అధికారులు పేర్కొన్నారు. సాంకేతిక కారణాల వల్ల ఆ మూడు సెషన్ల హాల్ టికెట్లను విడుదల చేయలేకపోతున్నామని, ఈ సెషన్స్‌కు సంబంధించిన హాల్ టికెట్లు సంబంధిత వెబ్‌సైట్‌లో డిసెంబర్ 28 నుంచి అందుబాటులో ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు. టెట్ హాల్ టికెట్ల కోసం https://tgtet2024.aptonline.in/tgtet/ అనే వెబ్‌సైట్‌ను సంప్రదించొచ్చు. టెట్ హాల్ టికెట్ డౌన్ లోడ్ కోసం జర్నల్ నంబర్, పుట్టిన తేదీ తప్పనిసరి.

## నీట్ పీజీ మెరిట్ జాబితా విడుదల

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**




పీజీ మెడికల్ వైద్య విద్యలో ప్రవేశాల కోసం మెరిట్ విద్యార్థుల జాబితాను కాళోజీ హెల్త్ యూనివర్సిటీ విడుదల చేసింది. మొత్తం 3314 మంది విద్యార్థులు పీజీ వైద్య సీట్ల కోసం అర్హత సాధించారు. మెరిట్ జాబితాలో 1,29,736 ర్యాంకు వరకు విద్యార్థులకు చోటు దక్కింది. మెరిట్ జాబితా విడుదల చేయడంపై తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. త్వరలోనే కోర్టు కేసును పరిష్కరించి నీట్ పీజీ రాష్ట్ర కోటా కౌన్సిలింగ్ ను నిర్వహించాలని కాళోజీ హెల్త్ యూనివర్సిటీని కోరింది. ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరులోనే రాష్ట్ర కోటా నీట్ పీజీ కౌన్సిలింగ్ ప్రారంభమవాల్సి ఉండగా జాప్యం నెలకొనడంపై ఆందోళన వ్యక్తం చేసింది.

# బీసీల రిజర్వేషన్లపై స్పష్టత ఇచ్చాకే ఎన్నికలు జరపాలి



- లేనిపక్షంలో 'స్థానిక' ఎన్నికలు జరగనివ్వం
- జనవరి 3న ఇందిరా పార్కు వద్ద భారీ సభ
- ఎమ్మెల్సీ కవిత
- 40కిపైగా బీసీ కుల సంఘాల నేతల భేటీ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

42 శాతం బీసీ రిజర్వేషన్లపై స్పష్టత ఇచ్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇదే అంశంపై వచ్చే ఏడాది జనవరి 3 సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బీసీ సంఘాలతో కలిసి ఇందిరా పార్క్ వద్ద భారీ సభ నిర్వహిస్తాం అని కవిత పేర్కొన్నారు. 40 బీసీ సంఘాలతో సమావేశం అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రధాన డిమాండ్‌గా ఉన్న బీసీల రిజర్వేషన్ పెంపుపై స్పష్టత ఇవ్వకుండా ఎన్నికలు జరపడానికి వీలు లేదు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొంది. బీసీల జనాభా ఎంతో తెలియంది హామీ ఎలా ఇచ్చారు..? జనాభాలో సగానికిపైగా బీసీలు ఉన్నారు. కానీ 42 శాతం అని కాంగ్రెస్ ఎలా చెబుతుందో అంతుపట్టడం లేదు. ఆ 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండానే ఎన్నికలు నిర్వహిస్తారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. రిజర్వేషన్లు పెంచకుంటే ఎన్నికలు జరగనివ్వం. మండల కేంద్రాల్లో, జిల్లాల్లో నిరసన ప్రదర్శన చేస్తాం అని కవిత పేర్కొన్నారు.

42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయి. బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చాకా, బీసీ జనాభాను వెల్లడించిన తర్వాతే ఎన్నికలపై ఆలోచన చేయాలి. అంత వరకు స్థానిక సంస్థల ఎన్నికల గురించి ప్రభుత్వం ఆలోచన చేయకూడదు. జనాభా లెక్కల్లో కులగణన చేపట్టాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఏటా రూ. 20 వేల కోట్లు బీసీలకు బడ్జెట్ కేటాయిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పింది అని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు.

## ప్రముఖ వ్యాపారవేత్త 'ఒసాము సుజు'కీ కన్నుమూత



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

దిగ్గజ వ్యాపారవేత్త, జపాన్ ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ సుజుకీ మోటార్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఒసాము సుజుకీ (94) కన్ను మూశారు. లింఫోమా అనే బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ డిసెంబర్ 25వ తేదీన తుది శ్వాస విడిచినట్లు సుజుకీ మోటార్ కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. జపాన్‌కే పరిమితమైన సుజుకీ కంపెనీని ప్రపంచ వ్యాప్తం చేయడంలో ఒసామూ సుజుకీ కీలక భూమిక పోషించారు. భారత్‌లో అతిపెద్ద కార్ల తయారీ కంపెనీగా వెలుగొం దుతున్న మారుతీ సుజుకీ ఏర్పాటుకు ఆద్యుడు ఆయనే. దశాబ్దాల పాటు సుజుకీ సంస్థకు ఛైర్మన్‌గా సేవలందించారు.

జపాన్‌లోని గెరోలో 1930, జనవరి 30వ తేదీన ఒసాము జన్మించారు. ఆయన అసలు పేరు ఒసాము మత్సుడా. స్థానిక బ్యాంకులో రుణ వితరణ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన 1958లో షోహె సుజుకీని పెళ్లి చేసుకున్నారు. సుజుకీ కుటుంబానికి వారసులు లేకపోవడంతో వారి వివాహం తర్వాత ఆయన పేరు చివరన సుజుకీ చేరింది. ఆ తర్వాత సుజుకీ కంపెనీ పగ్గాలు చేపట్టారు. కార్లు, ద్విచక్రవాహనాలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడంలో ఒసాము కీలక పాత్ర పోషించారు.

ఒసాము హయాంలోనే జనరల్ మోటార్, ఫోక్స్ వ్యాగన్ వంటి దిగ్గజ కంపెనీలతో వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పరుచుకున్నారు. ఇలా ఉత్తర అమెరికా, యూరప్ దేశాల్లో సుజుకీని విస్తరించారు. 1980లో భారత్‌లోకి ఇదే తరహాలో సుజుకీ కంపెనీని తీసుకొచ్చారు. మారుతీ ఉద్యోగ్ పేరుతో భారత ప్రభుత్వంతో కలిసి ఆటోమొబైల్ జాయింట్ వెంచర్ ప్రారంభించారు. ఆ తర్వాతి కాలంలో ఆ కంపెనీ మారుతీ సుజుకీగా మారింది. దీనిని ప్రభుత్వం 2002లో ప్రైవేటీకరణ చేసింది. దీంతో పూర్తి స్థాయిలో సుజుకీ అధీనంలోకి వెళ్లిపోయింది. ఆ సంస్థకు 52 శాతానికిపైగా వాటా ఉంది. అలాగే మన దేశంలో ఎంట్రీ ఇచ్చిన తొలి విదేశీ కంపెనీ సైతం సుజుకీ కావడం విశేషం. ప్రస్తుతం ఇండియాలో అతిపెద్ద కార్ల తయారీ కంపెనీగా మారుతీ సుజుకీ సేవలందిస్తోంది. ఈ సంస్థ తీసుకొచ్చిన మారుతీ 800 దేశీయంగా పెద్ద చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే.

## సీఏ ఫలితాల్లో సత్తా చాటిన తెలుగు విద్యార్థులు..

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా సీఏ ఫైనల్ పరీక్షల ఫలితాల్లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్, తిరుపతికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. నవంబర్‌లో నిర్వహించిన సీఏ ఫైనల్ పరీక్షల ఫలితాలను ఐసీఏఐ గురువారం అర్ధరాత్రి విడుదల చేసింది. విద్యార్థులు వారి రోల్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్ ద్వారా స్కోర్ కార్డులు, మెరిట్ జాబితాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కాగా, సీఏ ఫైనల్ పరీక్షలో గ్రూప్–1లో 16.8%, గ్రూప్–2లో 21.36% ఉత్తీర్ణత సాధించారు. రెండు గ్రూపుల్లో కలిపి 13.44 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఐసీఏఐ ఒక ప్రకటనలో తెలిపింది.

ఈ ఫలితాల్లో హైదరాబాద్‌కు చెందిన హేరంబ్ మహేశ్వర్, తిరుపతికి చెందిన రిషబ్ ఓస్వాల్ ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్‌లో నిలిచారు. వీరిద్దరూ 508 మార్కులతో (84.67%) టాప్ ర్యాంక్ సాధించారు. అలాగే, అహ్మదాబాద్‌కు చెందిన రియా కుంజన్‌కుమార్ షా 501 మార్కులతో రెండో ర్యాంకు, కోల్‌కతాకు చెందిన కింజల్ అజ్మీరా 493 మార్కులతో మూడో ర్యాంక్ సాధించారని ఐసీఏఐ వెల్లడించింది.

## ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు బీఆర్ఎస్ నేతలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు బీఆర్ఎస్ ముఖ్య నేతలు హాజరు కానున్నారు. ఆర్థిక సంస్కరణల పితామహుడు మన్మోహన్ సింగ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలోని పార్టీ ఎంపీలు, నాయకుల బృందం ఘన నివాళులర్పించనుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు కేటీఆర్, ఎంపీలు, ప్రతినిధుల బృందం మన్మోహన్ సింగ్ అంత్యక్రియల్లో పాల్గొననున్నారు. మన్మోహన్ సింగ్‌కు బీఆర్ఎస్ నేతలు ఘనంగా వీడ్కోలు పలకనున్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంపై బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడుతూ.. దేశ ఆర్థిక సంస్కరణల ఆర్కిటెక్ట్‌గా మన్మోహన్ సింగ్ దేశానికి అమోఘమైన సేవలందించారు. దాంతో పాటు తెలంగాణకు ప్రత్యేకమైన అనుబంధం మన్మోహన్ సింగ్‌తో ఉంది. వారి కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన నాకు వారితో వ్యక్తిగత అనుబంధముంది. వారెంతో స్థితప్రజ్ఞత కలిగిన దార్శనికులు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి రాష్ట్ర ఏర్పాటు దాకా వారందించిన సహకారం తెలంగాణ సమాజం మరువదు. తెలంగాణ కోసం పోరాడుతున్న నాకు, టీఆర్ఎస్ పార్టీకి ప్రతి సందర్భంలో మనోధైర్యాన్ని నింపుతూ వారు అండగా నిలిచారు. వారు ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగింది. రాష్ట్ర ఏర్పాటులో సానుకూల వైఖరితో నాకు వారందించిన సహకారం మరువలేను. ఈ నేపథ్యంలో తెలంగాణ సమాజానికి అత్యంత ఆప్తుడైన మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులు అర్పించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. వారి కడసారి వీడ్కోలు సందర్భంగా అంత్యక్రియల్లో పాల్గొనాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను, ఎంపీలను ఆదేశించాను. ఈ మేరకు వారు హాజరుకానున్నారు అని తెలిపారు.

## చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం వాయిదా

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

చర్లపల్లిలో నిర్మించిన కొత్త రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం వాయిదా పడింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రేపు (28న) రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించాల్సి ఉండగా వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. కాగా, త్వరలోనే ప్రారంభోత్సవ తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

# పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించండి..



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని రేవంత్ రెడ్డి సర్కార్‌ను డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లంతా మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాపు ఘాట్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం పాటుపడ్డ సర్పంచ్‌ల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించడం లేదన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా ఏడాది కాలంగా ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. పెండింగ్ బిల్లులను చెల్లించ కపోవడంతో.. ఆర్థిక ఇబ్బందులు కొంతమంది సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కొందరి సర్పంచ్‌ల కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల కోసం తీసుకొచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేక వేధింపులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇక మాజీ సర్పంచ్‌లను మభ్యపెట్టకుండా.. వీలైనంత త్వరగా పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షుడు కేశబోయిన మల్లయ్య, గణేష్, నవీన్ కుమార్, పల్లె వెంకటేశం, సంఘం రాష్ట్ర నాయకులు ప్రణీత్ చంద్, బాషబోయిన ఉప్పలయ్య, లాగ్గాని రమేశ్, పూర్ణ చందర్ గౌడ్ రాష్ట్ర కమిటి తదితరులు పాల్గొన్నారు.

# మన్మోహన్‌కు అంతర్జాతీయ నేతల సంతాపం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అమెరికా, చైనా, కెనడా, ఫ్రాన్స్, రష్యా, మలేషియా, శ్రీలంక, బంగ్లాదేశ్, ఇరాన్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపాలు వెల్లువెత్తాయి. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. భారత్–చైనా సంబంధాలకు సింగ్ సానుకూల సహకారం అందించారని పేర్కొంది. బ్రిక్స్ వంటి సంకీర్ణాలకు మన్మోహన్ సింగ్ అందించిన సహకారాన్ని శ్రీలంక అధ్యక్షుడు అనురా కుమార దిసానాయకే గుర్తు చేసుకున్నారు. "శ్రీలంక ప్రజల తరపున, నా తరపున ఇండియాకు, మన్మోహన్ సింగ్ కుటుంబానికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అసంఖ్యాక అభిమానులకు హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆయన దార్శనికత కలిగిన నాయకుడు. ఆయన ప్రభావం జాతీయ సరిహద్దులను అధిగమించింది. 2004 నుంచి 2014 వరకు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో తీసుకొచ్చిన విద్యా హక్కు చట్టం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వంటి పథకాలు, ఆయన విధానాలు, ఇతరులను కలుపుకుపోవడం పట్ల ఆయన దృఢమైన నిబద్ధతను ప్రతిబింబించాయి" అని అన్నారు.

మన్మోహన్ సింగ్ మరణం పట్ల రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ సంతాపం వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ చీఫ్ అడ్వైజర్ ముహమ్మద్ యూనస్ సంతాపం తెలిపారు. మన్మోహన్ సింగ్ గొప్ప వినయం కలిగిన వ్యక్తిగా, దూరదృష్టి గల నాయకుడిగా, రాజనీతిజ్ఞుడిగా, దేశ ప్రజల సంక్షేమానికి భరోసా ఇవ్వడంలో అచంచలమైన నిబద్ధతకు పేరుగాంచిన వ్యక్తిగా అభివర్ణించారు. మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం సంతాపం తెలిపింది. ఆఫ్ఘనిస్తాన్ మాజీ అధ్యక్షుడు హమీద్ కర్జాయ్ సంతాపం తెలుపుతూ ఇండియా అత్యంత ప్రసిద్ధ కుమారుల్లో ఒకరిని కోల్పోయిందని అన్నారు.

ఐఎంఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపినాథ్ మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలిపారు. మన్మోహన్ సింగ్ సంస్కరణలు భారతదేశాన్ని మార్చాయని, సంకెళ్లు లేని ఆర్థిక వ్యవస్థను తయారు చేశాయని తెలిపారు.

అదే విధంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు గౌరవార్థం ఇండియా క్రికెట్ క్రీడాకారులు చేతికి నల్ల బ్యాండ్ ధరించారు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగో టెస్టు రెండో రోజు భారత క్రికెట్ జట్టు చేతికి నల్ల బ్యాండ్‌లు కట్టుకుంది.

## మీ సేవ పేరుతో నకిలీ వెబ్‌సైట్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఇంతవరకు ప్రైవేటు సంస్థల వెబ్‌సైట్లకు నకిలీవి సృష్టించి దోచుకుంటున్న సైబర్ మోసగాళ్లు ఇప్పుడు ప్రభుత్వం వెబ్‌సైట్లపై దృష్టి పెట్టారు. ఐటీ శాఖ పరిధిలోని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (మీ సేవ) అధికారిక వెబ్‌సైట్‌ను పోలిన నకిలీది సృష్టించి భారీగా దండుకున్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేరుతో నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు సృష్టించారు. ఈ వ్యవహారం గురువారం ప్రభుత్వం దృష్టికి రావడంతో చర్యలు చేపట్టింది. ఆ నకిలీ వెబ్‌సైట్‌ను ఐటీ శాఖ బ్లాక్ చేయించింది. అయితే ఈ వ్యవహారం కొద్ది రోజులుగా సాగుతుండటంతో ఇప్పటికే మోసగాళ్లు రూ.కోట్లలో వసూలు చేసినట్టు తెలిసింది. మీ సేవ అధికారిక వెబ్‌సైట్ పేరుతో ఉంది. పేరుతో సైబర్ నేరగాళ్లు నకిలీది సృష్టించారు. కొత్తగా మీసేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామంటూ కలెక్టర్ అనుదీప్ పేరుతో నకిలీ ఉత్తర్వులు సృష్టించి అందులో ఉంచారు. అది చూసి అనేక మంది ఆశావహులు ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేశారు. ఈ విషయాన్ని తెలంగాణ మీ సేవ ఆపరేటర్ల సమాఖ్య కలెక్టర్‌తో పాటు ఐటీ శాఖ దృష్టికి తీసుకెళ్లింది. ఐటీ శాఖతో పాటు కలెక్టర్ కూడా సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేశారు. మీసేవ కేంద్రాలకు సంబంధించి తాను ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వలేదని ఆయన మీడియాతో పేర్కొన్నారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షల సందేశాలతో జాగ్రత్త

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

'నూతన సంవత్సర శుభాకాంక్షల' పేరుతో ఉన్నదంతా దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు ప్రస్తుతం సిద్ధమవుతున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వారి చేతికి చిక్కి ఖాతాలు ఖాళీ చేసుకోవడమే కాదు, ఫోన్లలో ఉన్న వ్యక్తిగత సమాచారం అంతా పోగొట్టుకోవాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. మరో నాలుగు రోజుల్లో కొత్త ఏడాదిలో అడుగుపెట్టబోతున్నాం. డిసెంబరు 31 అర్ధరాత్రి 12 గంటల నుంచే ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకోవడం పరిపాటి. సైబర్ నేరగాళు ఈ ఉచ్చుకతనే తమకు అనుకూలంగా మార్చుకొనున్నారు. ఈ క్రమంలో సాధారణంగా కాకుండా రకరకాల చిత్రాలు, సందేశాలను మీ పేరుతో సహా తయారు చేసుకొని పంపవచ్చని, ఇందుకోసం ఈ కింది లింకుపై క్లిక్ చేసి వివరాలు నమోదు చేస్తే చాలని సెల్‌ఫోన్లకు సందేశాలు వస్తున్నాయి. పొరపాటున వాటిపై క్లిక్ చేశారంటే పంగనామాలు తప్పవు. ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్(ఏపీకే) ఫైల్స్ రూపంలో పంపే ఈ గూఢచర్య అప్లికేషన్ ఒకసారి మీ ఫోన్లోకి జొరబడిందంటే అందులోని సమస్త సమాచారం నేరగాళ్ల అధీనంలోకి వెళ్లిపోతుంది. బ్యాంకు ఖాతాల వివరాలు, ఫొటోలు, వీడియోలు, కాంటాక్ట్ నంబర్లు, ఇతర ఫైల్స్ అన్నీ తీసేసుకుంటారు. కాబట్టి నూతన సంవత్సర సందేశాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే పెద్దఎత్తున సందేశాలు పంపుతున్న సైబర్ కేటుగాళ్లు రాబోయే రెండు, మూడు రోజుల్లో తమ దాడుల్ని తీవ్రతరం చేసే అవకాశం ఉంది.

## పీహెచ్‌డీ విద్యార్థిని ఆత్మహత్య

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- పరారీలో ఇద్దరు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో పరిశోధక విద్యార్థిని ఆత్మహత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఉద్యోగం ఇప్పిస్తానని తండ్రి డబ్బు తీసుకుంటే.. తిరిగివ్వాలంటూ కుమార్తెను వెధించడంతో ఆమె మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసులో మృతురాలి తండ్రి సంగీతరావు, అనిత, ఆమె తండ్రి సోమయ్యను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనిత భర్త అనిల్, సైదులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. పులివర్తి నాగమణి– పులివర్తి సంగీతరావు దంపతులు. సంగీతరావు గతంలో హబ్సిగూడలోని ఐఐసీటీలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. సంగీతరావు ఇతరుల నుంచి డబ్బు తీసుకుని చెల్లించలేకపోయేవాడు. దాంతో వడ్డీ వ్యాపారులు తరచూ వారి ఇంటికి వచ్చి ఆందోళన చేసేవారు.

దాంతో నాగమణి భర్త ప్రవర్తనతో విసిగిపోయి 2 సంవత్సరాల నుంచి అతని నుంచి దూరంగా జీవిస్తోంది. వారి కుమార్తె దీప్తి(29) ఐఐసీటీలో ప్రాజెక్టు అసిస్టెంట్‌గా పనిచేసేది. అయితే, వీరి ఇంటి ఎదురుగా ఉండే కానిస్టేబుల్ అనిల్ భార్యకు ఐఐసీటీలో ఉద్యోగం ఇప్పిస్తానని సంగీతరావు 2022లో రూ.15 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోవడంతో అనిల్ తన డబ్బు తిరిగి ఇవ్వాలని దీప్తిని అడిగేవాడు. డబ్బు తన తండ్రి తీసుకున్నాడని, ఆయన తమతో కలిసి ఉండటం లేదని సమాధానం చెప్పింది. అనిల్ పట్టించుకోకుండా తన భార్యతో నాచారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించాడు. దాంతో దీప్తి, సంగీతరావు మీద ఛీటింగ్ కేసు నమోదైంది. అనిల్, అనిత న్యాయస్థానంలో సివిల్ దావా కూడా వేశారు. ఈ విషయమై అనిత, అనిల్, అనిత తండ్రి సోమయ్య, సోదరుడు సైదులు కలిసి కేసు ఉపసంహరించుకునేందుకు రూ.35 లక్షలు డిమాండ్ చేసి, వారి జీవితాలను నాశనం చేస్తామని బెదిరించారు. దాంతో మనస్తాపానికి గురైన దీప్తి బుధవారం రాత్రి 10 గంటల సమయంలో చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి వచ్చి చూసేసరికి అప్పటికే మరణించింది. ఫోన్ తనిఖీ చేస్తే.. సెల్ఫీ వీడియో ఉంది. ఈ మేరకు నాచారం పోలీసులు సంగీతరావు, అనిత, ఆమె తండ్రి సోమయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనిత భర్త అనిల్, సైదులు పరారీలో ఉన్నారు.

## బ్రహ్మపుత్ర నదిపై ప్రపంచ అతి పెద్ద డ్యామ్ నిర్మిస్తాం

- చైనా

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై ప్రపంచంలోకెల్లా అతిపెద్ద డ్యామ్ నిర్మించబూనడాన్ని చైనా శుక్రవారం సమర్థించుకుంది. నది నీరు ప్రవహించే పరిసర రాష్ట్రాల్లో భద్రత సమస్యలు దృష్టిలో ఉంచుకునే నిర్మాణం చేపడతానని స్పష్టం చేసింది. ఇందుకు దశాబ్దాలుగా అధ్యయనం చేసినట్లు పేర్కొంది. 137 బిలియన్ అమెరికా డాలర్లతో నిర్మించే ఈ డ్యామ్ విషయంలో ఎలాంటి భయాందోళనలను పెట్టుకోవద్దని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ అన్నారు. సురక్షణ విషయంలో దశాబ్దాలుగా లోతైన అధ్యయనాలు చేసినట్లు కూడా ఆమె పేర్కొన్నారు. టిబెట్‌లో హైడ్రో పవర్ అభివృద్ధిపై, రక్షణ చర్యలపై దశాబ్దాలుగా అధ్యయనాలు చేపట్టినట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో ఈ ప్రాజెక్టు ఎలాంటి నష్టం కలిగించబోదని ఆమె స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాలున్న దేశాలతో చైనా ఈ విషయంలో చర్చలు కొనసాగించగలదన్నారు. ఇదిలావుండగా ఈ ప్రాజెక్టు నిర్మాణానికి చైనా బుధవారం ఆమోదం తెలిపింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్‌ఫ్రా ప్రాజెక్టు కాగలదని పేర్కొంది. డిసెంబర్ 18న సీమాంతర సరిహద్దు నదుల విషయం జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మధ్య జరిగిన చర్చల్లో చోటుచేసుకుంది. కాగా భూకంపాలు సంభవించే టెక్టోనిక్ ప్లేట్ సరిహద్దులో ఈ ప్రాజెక్టు సైట్ ఉండడం వల్ల అనేక ఇంజనీరింగ్ సవాళ్లను లేవనెత్తగలదని భావిస్తున్నారు. టిబెట్ పీఠభూమిని 'ప్రపంచ పై కప్పు'గా పరిగణిస్తుంటారు. టెక్టోనిక్ ప్లేట్‌లో ఈ ప్రాంతం ఉన్నందున ఇక్కడ తరచూ భూకంపాలు వస్తుంటాయి.



## కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సంతాపం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ శ్రద్ధాంజలి ఘటించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీతోపాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలు హాజరయ్యారు. మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా సీడబ్ల్యూసీ నేతలు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తీర్మానం ఆమోదించింది. దేశ రాజకీయ, ఆర్థిక రంగంలో ఆయన ఒక మహోన్నత వ్యక్తి అని, దీని సహకారం దేశాన్ని మార్చివేసిందని తీర్మానంలో పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ఆయనకు గౌరవాన్ని సంపాదించిపెట్టిందని తెలిపింది. తన జీవితం, పని భారతదేశ విధిని గాఢంగా రూపొందించిన "నిజమైన రాజనీతిజ్ఞుడిని" కోల్పోయిందని పేర్కొంది.

# మన్మోహన్ సింగ్ సేవలు దేశం ఏనాటికీ మర్చిపోదు..



- మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ , వేములవాడ**

ఆర్థిక మేధావి,కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా మన్మోహన్ చేసిన సేవలు దేశం ఎన్నటికి మరిచిపోదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడలో శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని అన్నారు.మన్మోహన్ సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాని,దేశాన్ని తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించిన ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ అని,నిజాయితీ, మంచితనం, సమర్థవంతంగా పని చేయడంలాంటివి మన్మోహన్ సింగ్ ను చూసి నేర్చుకోవాలన్నారు. ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ప్రపంచంలోనే ఆర్థిక శక్తిగా నిలబెట్టిన ఘనుడు మన్మోహన్ సింగ్ అని,పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో మన్మోహన్ సింగ్ ఆర్థిక శాఖ మంత్రిగా,అనంతరం పది సంవత్సరాలు ప్రధానిగా దేశానికి ఎంతో సేవ చేశారని అన్నారు. పేద ప్రజలకు జాతీయ ఉపాధి హామీ పథకం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని అన్నారు.మేధావి, మితభాషి, సౌమ్యుడు, స్థిత ప్రజ్ఞత కలిగిన నేతగా మన్మోహన్ సింగ్ మన యువతరానికి ఆదర్శం అన్నారు. మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటుని, వారి నిరాడంబర జీవితం, దేశం పట్ల వారి అంకిత భావం భావితరాలకు స్ఫూర్తి దాయకం అన్నారు.. ఆ మహనీయుని ఆత్మకు శాంతి ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు..

## ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య..

**బలగం టీవీ , బోయినిపల్లి**

కడుపు నొప్పి భరించలేక ఓ వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయిని పల్లి మండలం స్తంభంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు స్థానికుల తెలిపిన వివరాలు ప్రకారం స్తంభంపల్లి గ్రామానికి చెందిన పర్ష సుందరయ్య (70) గత కొంతకాలంగా విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతున్నాడని, ఎన్నో హాస్పిటల్లో చూపించిన కూడా కడుపు నొప్పి తగ్గకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుని భార్య పర్శ కాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు.

## రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపునకు ఎంపికైన గిరిజన కళాశాల విద్యార్థి



**బలగం టీవీ ,తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని గిరిజన మహిళ డిగ్రీ కళాశాల కు చెందిన విద్యార్థి జె సునీత ఢిల్లీలోని రాజపత్ వద్ద జరిగే రిపబ్లిక్ డే పరేడ్ వేడుకల్లో పాల్గొనడానికి ఎంపికయింది. తాను ఢిల్లీ వెళ్తున్న సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రెహానా ఇఫ్పత్ మరియు ఎన్ సి సి బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నాల్ డేనియల్ లాట్ జెమ్,కళాశాల ఉపాధ్యాయులు మరియు నాన్ టీచింగ్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయింది..



**బలగం టీవీ , బోయినిపల్లి**

దేశం గొప్ప ఆర్థికవేత్త ను కోల్పోయిందని సిఐటియు మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ అన్నారు.శుక్రవారం బోయినిపల్లి మండల కేంద్రంలో సిఐటియు మరియు గ్రామపంచాయతీ కార్మికుల ఆధ్వర్యంల మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కి చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మండల సిఐటియు కన్వీనర్ గురిజాల శ్రీధర్ మాట్లాడుతూ 2004 నుంచి 2014 వరకు భారతదేశానికి ఎన్నో సేవలు అందించిన ఘనత మన్మోహన్ సింగ్ కే దక్కుతుందని అన్నారు. ఆర్థిక సంస్కరణల విషయంలో భారతదేశాన్ని ముందుకు తీసుకువెళ్లాడని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ విషయంలో తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా నిలబడి, తెలంగాణ రావడానికి కీలక పాత్ర పోషించినటువంటి చరిత్ర అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు అక్కనపల్లి లచ్చయ్య, కొండవీని నాగరాజు, కత్తెరపాక నరేష్, కురుమ సంజీవ్, కత్తెరపాక వెంకటేష్, దాసరి బాబు, కుడుకల పరశురాం మరియు మిగతా గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామాల వారిగా కార్మికులు పాల్గొన్నారు.

## మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు...

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

**బలగం టీవీ , సిరిసిల్ల**




భారతదేశ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. శుక్రవారం సిరిసిల్ల లోని బీఆర్ఎస్ భవన్లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి, ఘనంగా నివాళులర్పించారు. మన్మోహన్ సింగ్ మృతి పట్ల ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా తోట ఆగయ్య మాట్లాడుతూ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో దేశం ఒక మహా నాయకుడిని కోల్పోయిందని అన్నారు.ఆర్థిక శాస్త్రవేత్తగా ప్రస్థానం ప్రారంభించి, 1991లో ఆర్థిక సంస్కరణల ద్వారా దేశ ఆర్థిక వ్యూహాన్ని మారుస్తూ, దేశాన్ని గ్లోబల్ మార్కెట్లోకి చేర్చడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు.ఐఎంఎఫ్, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ వంటి అంతర్జాతీయ స్థాయి బాధ్యతలను నిర్వహించిన అనంతరం, కేంద్ర ఆర్థిక మంత్రి మరియు 10 సంవత్సరాల ప్రధానమంత్రిగా పని చేశారని,ఏ బాధ్యత నిర్వహించినా ప్రతి చోటా తనదైన ముద్ర కనబరిచారని అన్నారు.ప్రధానమంత్రిగా తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేసి తెలంగాణ ప్రజల కలను సాకారం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ వైస్ చైర్మన్ మంచే శ్రీనివాస్, బీ ఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# రాజన్న గోవుల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ, వేములవాడ**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గోవులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. శుక్రవారం వేములవాడ రాజ రాజేశ్వర స్వామి ఆలయ పరిధిలోని తిప్పాపూర్ గోశాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోశాల ఆవరణ, అక్కడ చేపడుతున్న పనులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ గోశాలలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సివిల్ పనులను నిర్దేశిత గడువులోగా చేయాలని సూచించారు. గోవుల సంరక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. దాణా, ఇతర విషయాల్లో జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. ఇక్కడ జిల్లా పశు సంవర్ధక అధికారి రవీందర్ రెడ్డి, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈఓ వినోద్ రెడ్డి, ఈఈ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులు



**బలగం టీవీ ,తంగళ్ళపల్లి**

భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తంగళ్ళపల్లి మండల కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులర్పించారు.మండల కేంద్రంలోని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మన్మోహన్ సింగ్ దేశానికి రెండుసార్లు ప్రధానిగా సేవలు అందించి గొప్ప ఆర్థిక వేత్త అని, దేశానికి ఆర్థిక మంత్రిగా సేవలు అందించి దేశంలో ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేపట్టిన గొప్ప నాయకుడని ఈ సందర్భంగా కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు టోనీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నరసింగం గౌడ్,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పొన్నాల పరుశు రాం,ఆరెపల్లి బాలు,తిరుపతి రెడ్డి,మండల నాయకులు పుర్మాని రాం లింగారెడ్డి, గుగ్గిళ్ల శ్రీకాంత్,మోర లక్ష్మీరాజం, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, బైరినేని రాము,జూపల్లి రాజేశ్వరరావు,పొన్నం లక్ష్మణ్, పెద్దూరు తిరుపతి,చెన్నమనేని ప్రశాంత్,బాలసాని శ్రీనివాస్, ధర్మారెడ్డి చందు,వాసుమల్లేశం యాదవ్,రెడ్డి పరశురాములు, ఆసాని సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు.

**బలగం టీవీ , బోయినిపల్లి**

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు బోయినిపల్లి మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ వెంకట రామ రావు,సెస్ డైరెక్టర్ కొట్టపెల్లి సుధాకర్,మార్కెట్ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి,మాజీ జడ్పీటీసీ సభ్యులు పులి లక్ష్మీపతి గౌడ్, మాజీ సెస్ డైరెక్టర్ ఏనుగుల కనుకయ్య, మాజీ ఎంపీటీసీ లు ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, సంబ లచ్చయ్య, పిట్టల రమేష్, కాంగ్రెస్ మరియు యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు మెరుపుల మహేష్, పెంద్యాల శ్రీనివాస్ రెడ్డి,కొలుపుల ప్రవీణ్,వెంకట్ రెడ్డి, దయ్యాల రాజశేఖర్, గడ్డి కమలాకర్,అమ్మిగల్ల గోపాల్, ముదం శ్రీనివాస్,రఫీ,బేతి సుధాకర్, మహేందర్,బాబు, శ్రీకాంత్ చారి, లక్ష్మరెడ్డి, మ్యాన కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.






# భారత్ మహిళలు క్లీన్ స్వీప్

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

భారత మహిళల క్రికెట్ జట్టు వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. శుక్రవారం జరిగిన ఆఖరి వన్డేలో టీమిండియా ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీప్తి శర్మ(48 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 39 నాటౌట్, 6/31) ఆల్ రౌండ్ ప్రదర్శనతో భారత విజయంలో కీలక పాత్ర పోషించింది. ఇప్పటికే టీ20 సిరీస్ కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే.

ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 28.2 ఓవర్లలో 162 పరుగులకు కుప్పకూలింది. ఆ జట్టులో చిన్నెల్లె హెన్రీ(72 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 61) హాఫ్ సెంచరీతో రాణించగా.. కాంప్‌బెల్(62 బంతుల్లో 7 ఫోర్లతో 46) పర్వాలేదనిపించింది. భారత బౌలర్లలో రేణుకా సింగ్(4/29), దీప్తి శర్మ(6/31) అదరగొట్టారు.

అనంతరం లక్ష్యచేధనకు దిగిన భారత్ 28.2 ఓవర్లలో 5 వికెట్లకు 167 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. టాప్-3 బ్యాటర్లు స్మృతి మంధాన(4), ప్రతికా రవల్(18), హర్లీన్ డియోల్(1) విఫలమైనా.. హర్మన్‌ప్రీత్ కౌర్(22 బంతుల్లో 7 ఫోర్లతో 32), జెమీమా రోడ్రిగ్స్(45 బంతుల్లో ఫోర్‌తో 29), రిచా ఘోష్(11 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 23 నాటౌట్), దీప్తి శర్మ రాణించారు. వెస్టిండీస్ బౌలర్లలో డియాంద్రా డాటిన్, అలెన్, హీలీ మాథ్యూస్, కరిష్మా రామ్‌హరక్ తలో వికెట్ తీసారు. రిచా ఘోష్ వరుస సిక్సర్లతో విజయ లాంఛనాన్ని పూర్తి చేయడం గమనార్హం.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న పీవీ సింధు దంపతులు

**బలగం టీవీ, తిరుమల**



తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని భారత స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు , ఆమె భర్త భర్త వెంకట దత్తసాయి శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న సింధు దంపతులకు తితిదే అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సింధు దంపతులు స్వామి వారి అభిషేక సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వారికి పండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.

## రెండు పార్ట్‌లుగా 'వీడీ12'

**బలగం టీవీ, హైదరాబాద్**




విజయ్ దేవరకొండ, జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్ లో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. 'వీడీ12' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్ రానుండగా విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. సితార ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. అయితే ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు నిర్మాత నాగవంశీ. ఆయన మాట్లాడుతూ.. వీడీ12 ప్రాజెక్ట్ రెండు పార్టులుగా రాబోతుందని ప్రకటించాడు. ఈ ఆలోచన సినిమా తీస్తున్న టైంలో రాలేదని.. షూటింగ్ స్టార్ట్ అవ్వకముందే ఈ ఆలోచన వచ్చినట్లు తెలిపాడు. అయితే ఈ రెండు పార్టులలో రెండు వేరు వేరు కథలు ఉంటాయని నాగవంశీ చెప్పుకోచ్చాడు. మరోవైపు ఈ సినిమాను వచ్చే ఏడాది మార్చిలో తీసుకురావడానికి ప్లాన్ చేస్తున్నట్లు తెలిపాడు. ఒకవేళ ఆ టైంలో పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు ఉంటే తమ సినిమాను వాయిదా వేయనునట్లు చెప్పుకోచ్చాడు.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు చిరంజీవి నివాళ్లు

**బలగం టీవీ, హైదరాబాద్**

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట నటుడు మెగాస్టార్ చిరంజీవి నివాళ్లర్పించారు. ఆయన మాట్లాడుతూదేశంలోని గొప్ప రాజనీతిజ్ఞుల్లో మన్మోహన్ ఒకరని కొనియాడారు. ఉన్నత విద్యావంతులు, మృదుస్వభావి, వినయంగా ఉండే నాయకుడని అన్నారు. రెండు సార్లు ప్రధానిగా ఉండి దేశ చరిత్రలో నిలిచిపోయే మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. మన్మోహన్ లాంటి గొప్ప నాయకుడి హయాంలో పార్లమెంట్ సభ్యుడిగా, పర్యాటకశాఖ సహాయమంత్రిగా పని చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని చిరంజీవి అన్నారు. ఆయన నుంచి ఎన్నో విషయాలను నేర్చుకున్నానని చెప్పారు. మన్మోహన్ మృతి దేశానికి తీరని లోటు అని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని చెప్పారు.


## వెంకీ సంక్రాంతి పాట

విక్టరీ వెంకటేష్ నటిస్తున్న తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. జనవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో సంక్రాంతి స్పెషల్ సాంగ్‌కు వెంకటేష్ గాత్రాన్ని అందించారు. గ గురువారం 'బిహైండ్ వీడియో' పేరుతో ఈ పాట తాలూకు విశేషాలను పంచుకున్నారు. ఈ పాటను తానే పాడతానని వెంకటేష్ అడుగుతుండగా చివరికి అనిల్ రావిపూడి ఒకే చెప్పడాన్ని వీడియోగా విడుదల చేశారు. సినిమాలో ఈ పాట హైలైట్‌గా నిలుస్తుందని, ప్రస్తుతం ఈ ఫెస్టివల్ సాంగ్ చిత్రీకరణ జరుగుతున్నదని మేకర్స్ తెలిపారు.

# ఆస్ట్రేలియా భారీ స్కోరు.. కష్టాల్లో భారత్

## రోహిత్, కోహ్లి, రాహుల్ విఫలం.. ఆస్ట్రేలియా 474 ఆలౌట్.. భారత్ 164/5

**బలగం టీవీ, మెల్‌బోర్న్**



బాక్సింగ్ డే టెస్టులో భారత్ కష్టాల్లో పడింది. ఆస్ట్రేలియా తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 474 రన్స్ స్కోర్ చేసింది. ఇక భారత్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 46 ఓవర్లలో 5 వికెట్లకు 164 పరుగులు చేసింది. క్రీజులో రిషభ్ పంత్(6 బ్యాటింగ్)తో పాటు రవీంద్ర జడేజా(4) ఉన్నారు. ఆస్ట్రేలియా బౌలర్లలో స్కాట్ బోలాండ్, ప్యాట్ కమిన్స్ రెండేసి వికెట్లు తీసారు.

రెండో రోజు మూడవ సెషన్‌లో ఆఖరి క్షణాల్లో వరుసగా ఇండియా మూడు వికెట్లను కోల్పోయింది. హాఫ్ సెంచరీ చేసిన జైస్వాల్ రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత బోలాండ్ బౌలింగ్‌లో కోహ్లి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. 153 రన్స్‌కు రెండు వికెట్లు కోల్పోయి.. స్థిరంగా ఆడుతున్నట్లు కనిపించిన ఇండియా అకస్మాత్తుగా మరో రెండు వికెట్లను చేజార్చుకున్నది. నైట్‌వాచ్‌మెన్‌గా వచ్చిన ఆకాశ్ దీప్ కూడా పెవిలియన్ బాటపట్టాడు. 13 బంతులు ఆడిన అతను డకౌట్ అయ్యాడు. ప్రస్తుతం పంత్, జడేజా క్రీజ్‌లో ఉన్నారు.

అంతకుముందు 311/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 474 పరుగుల భారీ స్కోర్ చేసింది. స్టీవ్ స్మిత్(197 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్స్‌లతో 140) భారీ శతకంతో చెలరేగగా..సామ్ కోన్‌స్టాస్(65 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 60), ఉస్మాన్ ఖవాజా(121 బంతుల్లో 6 ఫోర్లతో 57), మార్నస్ లబుషేన్(145 బంతుల్లో 7 ఫోర్లతో 72)హాఫ్ సెంచరీలతో రాణించారు.భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా నాలుగు వికెట్లు తీయగా, రవీంద్ర జడేజా మూడు వికెట్లు పడగొట్టాడు. ఆకాశ్ దీప్‌కు రెండు వికెట్లు దక్కగా.. వాషింగ్టన్ సుందర్ ఒక వికెట్ తీసాడు.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. మళ్లీ ఓపెనర్‌గా బరిలోకి దిగిన రోహిత్ శర్మ(3) చెత్త షాట్‌తో పెవిలియన్ చేరాడు. క్రీజులోకి వచ్చిన కేఎల్ రాహుల్(24)తో యశస్వి జైస్వాల్ ఆచితూచి ఆడాడు. మరోవైపు రాహుల్ కూడా సాధికారికంగా బ్యాటింగ్ చేశాడు. క్రీజులో సెట్ అవుతున్న ఈ జోడీని ప్యాట్ కమిన్స్ విడదీసాడు. స్టన్నింగ్ డెలివరీతో కేఎల్ రాహుల్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. క్రీజులోకి విరాట్ కోహ్లి రాగా.. యశస్వి జైస్వాల్ తనదైన శైలిలో బ్యాటింగ్ చేశాడు. కోహ్లి సైతం చాలా ఓపికగా ఆడాడు. ముఖ్యంగా ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ డెలివరీల జోలి పోకుండా తనను తాను నియంత్రించుకున్నాడు. కోహ్లి నిదానంగా ఆడినా.. యశస్వి జైస్వాల్ మాత్రం బౌండరీల మోత మోగించాడు. ఈ క్రమంలో అతను 81 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.ఆ తర్వాత మరింత దూకుడుగా ఆడిన అతను వేగంగా పరుగులు చేస్తూ శతకం దిశగా సాగాడు. కానీ యశస్వి జైస్వాల్ లేని పరుగుకు ప్రయత్నించి రనౌటయ్యాడు. తర్వాత కోహ్లి.. స్కాట్ బోలాండ్ బౌలింగ్‌లో కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. నైట్ వాచ్ మన్‌గా వచ్చిన ఆకాశ్ దీప్ కూడా ఔటవ్వడంతో 159 పరుగులకే టీమిండియా సగం వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. క్రీజులోకి వచ్చిన జడేజా, పంత్ మరో వికెట్ పడకుండా తొలి రోజు ఆటను ముగించారు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి.. ఇండియా 5 వికెట్ల నష్టానికి 164 రన్స్ చేసింది. పంత్ 6, జడేజా 4 రన్స్‌తో క్రీజ్‌లో ఉన్నారు.




# హాలిడే మూడ్‌లో సమంత

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రముఖ హీరోయిన్ సమంత ప్రస్తుతం హాలిడే మూడ్ లో ఉన్నారు. క్రిస్మస్, న్యూఇయర్ సందర్భంగా చిల్ అవుతున్నట్లు సోషల్ మీడియాలో ఫొటోలు పోస్ట్ చేశారు. జీసస్ ను ప్రార్థిస్తూనే గణేశుడికీ పూజలు చేసినట్లు సమంత ఫొటోలు చూస్తే తెలుస్తోంది. తాజాగా సమంత తన ఇన్ స్టా అకౌంట్ లో బెడ్ పై పడుకున్న ఫొటోస్ షేర్ చేస్తూ.. హ్యాపీ హాలీడేస్ అంటూ క్యాప్షన్ జత చేసింది. మార్నింగ్ మోటివేషన్.. మనం చేయగలం సామ్ మీ కలలను ఫాలో అవండి.. వాటికి మార్గం తెలుసు.. కొటేషన్‌ను హైలెట్ చేస్తూ.. బహుశా చూస్తూ కూర్చోవడం మంచిది. లేదంటే కాసేపు వేచి ఉండవచ్చు. బిజీ ప్రపంచంలో మీకు కావలసిందల్లా సాధారణ జీవితం. ప్రణాళిక లేకపోవడమనేది కూడా ప్రణాళికలో భాగమే కావచ్చు.. చక్కర్లు కొట్టడానికి.. హ్యాపీ హాలీడేస్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. క్రిస్టియన్ కుటుంబంలో జన్మించినప్పటికీ సమంత హిందూ సంప్రదాయాలను కూడా పాటిస్తారు. హిందూ దేవుళ్లకు కూడా పూజలు చేస్తుంటారు. తాజా పోస్ట్‌లో సమంత ఇంట్లో గణేశుడు, దుర్గామాతల చిత్రాలు కనిపిస్తున్నాయి.

ఇక సమంత ఓ వైపు బెడ్‌పై దుప్పటి కప్పుకొని హాయిగా నిద్రపోతున్న స్టిల్.. మరోవైపు వర్కవుట్ స్టిల్‌ను షేర్ చేయగా.. ఇప్పుడీ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇటీవల 'సిటాడెల్ : హనీ బన్నీ' అనే వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సమంత.. ప్రస్తుతం రక్త బ్రహ్మాండ సిరీస్ లో నటిస్తున్నారు.

## అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్.. విచారణ వాయిదా

**బలగం టీవీ, హైదరాబాద్**

సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో నటుడు అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ పై విచారణ వాయిదా పడింది. తనకు రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలని బన్నీ నాంపల్లి కోర్టులో పిటిషన్ వేశారు. కౌంటర్ దాఖలు చేసేందుకు పోలీసులు సమయం కోరడంతో విచారణను ఈ నెల 30వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు కోర్టు తెలిపింది. ఇక తొక్కిసలాట ఘటన నేపథ్యంలో బన్నీని ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కానీ, ఆయనకు హైకోర్టు నాలుగు వారాల మధ్యంతర బెయిల్ ఇవ్వడంతో విడుదలయ్యారు. మరోవైపు నాంపల్లి కోర్టు ఈ నెల 13న విధించిన 14 రోజుల రిమాండ్ నేటితో ముగిసింది. దీంతో బన్నీ ఈరోజు వర్చువల్‌గా న్యాయస్థానం ముందు విచారణకు హాజరయ్యారు. కాగా, సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై విచారణనూ నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. దీనిపై తదుపరి విచారణను జనవరి 10న చేపట్టనున్నట్లు వెల్లడించింది. అదే రోజు బన్నీ రిమాండ్‌పైనా కూడా విచారణ ఉండనుంది.

## 'దూరదర్శిని' టైటిల్ టీజర్

**బలగం టీవీ, హైదరాబాద్**

సువిక్షిత్ బొజ్జ, గీతిక రతన్ జంటగా నటిస్తున్న చిత్రం 'దూరదర్శిని'. కార్తికేయ కొమ్మి దర్శకుడు. వారాహ మూవీ మేకర్స్ పతాకంపై బి.సాయి ప్రతాప్ రెడ్డి, జయ శంకర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకుంటోంది. 1990వ నేపథ్యంలో అందరి హృదయాలను హత్తుకునే ప్రేమకథగా రూపొందుతున్న ఈ చిత్రం టైటిల్ టీజర్‌ను గురువారం ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ విడుదల చేశారు.